క్లుప్తంగా

వెంకన్న సేవలో వేములవాడ ఎమ్మెల్యే 'ఆది'


తిరుమలలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే

వేములవాడ: వేములవాడ ఎమ్మెల్యేగా గెలిచిన ఆది శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది, అర్చకులు ఆయనకు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన తాను ముందుగా వెంకన్నను దర్శించుకొని తలనీలాలు సమర్పించినట్లు తెలిపారు.

రాజన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే 'అడ్లూరి'


ప్రసాదం అందిస్తున్న ఆలయ పర్యవేక్షకుడు

వేములవాడ: వేములవాడ రాజన్నను ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం చేశారు. ఆయనవెంట సీఐ కరుణాకర్, ఆలయ పర్యవేక్షకుడు శ్రీరాములు తదితరులున్నారు.

సుంకరి ఇస్సాదారులను ఆదుకోవాలి

సిరిసిల్లటౌన్: సుంకరి ఇస్సాదారులను కాంగ్రెస్ సర్కారు ఆదుకోవాలని సుంకరి ఇస్సాదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్ కోరారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. నైజం కాలం నుంచి అన్ని గ్రామాల్లో సుంకరి పనులను ఇంటి పెద్ద పేరున కుటుంబ సభ్యులు అందరూ వంతుల వారీగా చేయడం జరుగుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెవెన్యూ రికార్డుల ఆధారంగా సుంకరి పేరున్న వారిని వీఆర్‌ఏలుగా మార్చిందని, దీంతో ఇస్సాదారుల బతుకులు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో సుంకరి ఇస్సాదారుల సమస్యను కూడా చేర్చి తగు న్యాయం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు నక్క పర్శరాములు, మండలాల బాధ్యులు తలారి రాజు, దామెర ప్రభాకర్, కొంపెల్లి స్వామి, నీరటి ఎల్లయ్య, దాసరి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

ఎల్లారెడ్డిపేట: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని మండలకేంద్రంలోని శ్రీ సాయిబాబా ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి మాట్లాడారు. ఎంపీటీసీ ఎలగందుల అనసూయ, సుభాశ్, నర్సింలు, బందారపు బాల్‌రెడ్డి, మెండే శ్రీనివాస్, నంది కిషన్, జీవన్ రెడ్డి, బాబు, దేవదాస్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'కు స్పందన



సిరిసిల్లటౌన్: జిల్లాలో ప్రతీ మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమానికి మంచి స్పందన వస్తుందని డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు తెలిపారు. సిరిసిల్లలోని పీఎస్ ఎనగర్, వేములవాడ పీఏసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన శిబిరాల్లో ఓపీడీ 596, బ్రెస్ట్ 596, ఓరల్ కావిటీ 596 పరీక్షలు జరిపినట్లు పేర్కొన్నారు. ఇవికాకుండా యూటీఐ 11, ల్యాబ్ 75, థైరాయిడ్ 43, విటమిన్ డీ 42, సీబీపీ 70, సూక్ష్మ పోషకా లు 51 మందికి పరీక్షలు నిర్వహించి వీరిలో 12 మందిని జిల్లాసుపత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధి శాత్రాజుపల్లి వద్ద మంగళవారం రాత్రి బైక్ అదుపుతప్పి యువకుడు మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్‌కు చెందిన పులి నవీన్ (32) బైక్‌పై వెళ్తుండగా శాత్రాజుపల్లిలోని మూలమలుపు వద్ద అదుపుతప్పి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. నవీన్ ఉపాధి నిమిత్తం కొన్ని నెలలుగా ఎల్లారెడ్డిపేట మండలం గజసింగవరంలో ఉంటున్నాడు. మంగళవారం రాత్రి స్వగ్రామానికి రాగా ప్రమాదం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటనా స్థలాన్ని వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

సమస్యల ప్రాంగణం

- పార్కింగ్‌కు అడ్డాగా ఎల్లారెడ్డిపేట బస్టాండ్
- మరుగుదొడ్లకు నీటి కరువు
- బురదమయంగా ప్రయాణ ప్రాంగణం
- చెట్లకిందే ప్రయాణికుల నిరీక్షణ



మండలకేంద్రంలోని బస్టాండ్

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమస్యల ప్రాంగణంగా మారింది. రోజూ బస్టాండ్‌కు దాదాపు వందబస్సుల వరకు వస్తుంటాయి. ప్రయాణికులతో పాటు స్థానికులు సమస్యలపై పలుసార్లు ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదు. ప్రయాణికులకు సరైన మరుగుదొడ్లు లేకపోవడం, కూర్చునేందుకు సైతం బల్లాలు లేకపోవడంతో బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. మారుమూల అటవీప్రాంత గ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు ఏ బస్సు ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. కంట్రోలర్ లేక బస్సుల సమయం చెప్పేవారు కరువయ్యారు. దీంతో ప్రయాణికులకు ప్రైవేట్ వాహనాలే దిక్కవుతున్నాయి.

ప్రధాన సమస్యలివే..

✦మరుగుదొడ్లు ఉన్నా నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మారాయి.

✦ప్రయాణికులు తాగునీరు ఏర్పాటు చేయకపోవడంతో హోటళ్లలోకి వెళ్లి నీటిని తాగుతున్నారు.

✦కంట్రోలర్ లేక సమాచారం ఇచ్చే వారు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

✦బస్టాండ్ ప్రాంగణమంతా పారిశుధ్య లోపంతో కంపుకొడుతోంది. వ్యర్థాలను ప్రాంగణంలోనే వదిలివెళ్తున్నారు.

✦బస్టాండ్ ఆవరణలో ప్రైవేట్ వాహనాలను దర్జాగా వాహనదారులు పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా ఆర్టీసీ బస్సులు వచ్చి వెళ్లడం ఇబ్బందిగా మారుతోంది.

చిన్నపాటి వర్షానికే బురదమయం..

బస్టాండ్ ప్రాంగణమంతా చిన్నపాటి వర్షానికి బురదమయంగా మారుతోంది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో బస్సులు ఒక్కోసారి ప్రాంగణంలోకి రాకుండానే ప్రధాన రహదారి గుండా వెళ్తున్నాయి. బస్టాండ్ ప్రాంగణాన్ని సీసీగా మార్చాలని విజ్ఞప్తి చేసినా ఫలితం లేదు. మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేకంగా కాంట్రాక్టు పద్ధతిలో కూలీలను నియమించాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకునేవారు లేరు. సమస్యలను పరిష్కరించి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలని పలువురు కోరుతున్నారు.


నిరుపయోగంగా మరుగుదొడ్లు

పట్టించుకోని అధికారులు

జిల్లాలో మేజర్ మండలమైన ఎల్లారెడ్డిపేటలోని ఆర్టీసీ బస్టాండ్‌లోని సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదు. సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న ఈ బస్టాండ్ నుంచి ముంబై, మహారాష్ట్ర, హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ తదితర జిల్లాలు, పట్టణాలకు నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు సమస్యలను పరిష్కరించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

దుర్వాసన వస్తోంది



బస్టాండ్ ప్రాంగణంలోని సమ్యలను పరిష్కరించాలి. మరుగుదొడ్లు లేక మహిళలు ఇబ్బంది పడుతున్నారు. ప్రాంగణంలో వ్యర్థాలను వదిలేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ప్రాంగణం మొత్తం బురదమయంగా మారడంతో ప్రయాణికులు బస్సులు ఎక్కేందుకు ఇబ్బందిగా ఉంది. అధికారులు సమస్యలను పరిష్కరించాలి.

– భూక్య మంజుల, రాచర్లగుండారం

సమస్యలు పరిష్కరిస్తాం



బస్టాండ్ ప్రయాణ ప్రాంగణంలో సమస్యలను పరిష్కరించి ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పిస్తాం. బస్టాండ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రైవేట్ వాహనాలు పార్కింగ్ చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. నీటి సమస్యలను పరిష్కరించి మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకువస్తాం. కంట్రోలర్‌ను నియమిస్తాం.

– మనోహర్, ఆర్టీసీ డీఎం, సిరిసిల్ల

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మానం


పుష్పగుచ్ఛం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్: మంత్రి పదవి చేపట్టిన పొన్నం ప్రభాకర్‌ను హుస్నాబాద్‌లో మండల కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించారు. బీసీ సంక్షేమ మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ప్రభాకర్‌ను సన్మానించినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి తెలిపారు. డీసీసీ ఉపాధ్యక్షుడు బుర్ర రాములు, ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ సర్పంచ్ తిరుపతి, రాజేశం, సత్యంగౌడ్, నరేశ్, గోవర్ధన్, భాను, విజయ్ తదితరులున్నారు.

వేములవాడ : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి హుస్నాబాద్‌కు చేరుకున్న పొన్నం ప్రభాకర్‌ను వేములవాడ మహిళా కాంగ్రెస్ నాయకులు పాత సత్యలక్ష్మి, సూగూరి లక్ష్మి, ఎలిజబెత్‌లు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చందుర్తి(వేములవాడ): రవాణా, బీసీ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను మండల కాంగ్రెస్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు లింగారెడ్డి, సనుగుల సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ముస్కు ముకుందరెడ్డి, ఎన్గల్ మాజీ సర్పంచ్ శంకర్‌లు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే, మంత్రి ప్రమాణ స్వీకారం చేసిన పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కరీంనగర్‌లోని ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం


సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రానికి చెందిన కార్వింగ్ కళాకారుడు శ్యామంతుల అనిల్‌కుమార్, పర్యావరణ పరిరక్షకుడు దుంపెన రమేశ్‌లు ఆదివారం విజయవాడలో జాతీయస్థాయి అవార్డులు అందుకోగా కాంగ్రెస్ మండల కమిటీ, సహాయ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రాజేందర్, రాజునాయక్, హిమాం, బాబు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వంగ గిరిధర్‌రెడ్డి, ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, వెంకట నర్సింహారెడ్డి, లక్ష్మారెడ్డి, పాల్గొన్నారు.

ముస్తాబాద్: విజయవాడ కళా ప్రపూర్ణ తెలుగు వెలుగు అవార్డును అందుకున్న సద్గుణాచారిని మండలంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. గూడెంకు చెందిన రాజూరి సద్గుణాచారి జ్యోతిష్యం, పౌరోహిత్యంలో ముప్పై ఏళ్లుగా అందిస్తున్న సేవలు గుర్తించి తెలుగు వెలుగు సాహితీ వేదిక విజయవాడ వారు మహానంది అవార్డుతో సత్కరించినట్లు మండల విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షుడు చింతోజు బాలయ్య అన్నారు. కార్యక్రమంలో జగన్నాథచారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన మైనార్టీ గురుకుల విద్యార్థులు

వేములవాడరూరల్: వేములవాడ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో చదువుతున్న అండర్–14 విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అనుమల్ల రాజేశ్ తెలిపారు. నవంబర్ 1న ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆకునూరులో జరిగిన టోర్నమెంట్, సెలక్షన్‌లో ప్రతిభచూపి మొదటి స్థానంలో నిలిచిన రోమాల శ్యామ్ కుమార్, దయ్యాల నివేద్ ఈనెల 13, 14, 15తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ దేవత ప్రభాకర్, పీఈటీ అక్కినపల్లి దేవయ్య, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి


వినతిపత్రం అందిస్తున్న యువకులు

కోనరావుపేట: సెస్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చైర్మన్ కే.ఈశ్వరయ్య అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం సెస్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. డివిజన్‌లోని పలు గ్రామాల వినియోగదారుల సమస్యలను తె లుసుకున్నారు. సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, పరిష్కార వేదిక సభ్యులు రామకృష్ణ, కిషన్, రాజాగౌడ్, ఏఈ దివ్య, లైన్ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం, తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని స్తంభంపల్లిలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని గ్రామానికి చెందిన అక్కెనపెల్లి కరుణాకర్, పలువురు యువకులు సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ ఈశ్వరయ్య, సెస్ ఎండీ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం మండలకేంద్రంలో జరిగిన విద్యుత్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందించినట్లు తెలిపారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ గృహాల సముదాయంలోని 33 కేవీ లైన్, అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌పై ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని, చంద్రగిరి రామయ్యపల్లిలో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరినట్లు కరుణాకర్ పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్లటౌన్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో బుధవారం అంతరాయం ఉంటుందని టౌన్ ఏఈ విష్ణుతేజ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 1గంట వరకు చంద్రంపేట, రగుడు, బోనాల, ముష్టిపల్లి, పెద్దూరు, సర్దాపూర్ ఏరియాల్లో కరెంటు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని గన్నెవానిపల్లి, తెర్లుమద్ది, ఆవునూర్, కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ విష్ణుతేజ తెలిపారు. సబ్‌స్టేషన్లలో ట్రాన్స్‌కో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంట్ సరఫరా ఉండదన్నారు.

కోనరావుపేట: నిజామాబాద్, మర్తనపేట, సుద్దాల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ దివ్య తెలిపారు. కొలనూర్, మర్తనపేట, ధర్మారం, నిజామాబాద్, మల్కపేట, కనగర్తి, సుద్దాల, మంగళపల్లి, పల్లిమక్త, నాగారం, రామన్నపేటలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లటౌన్: గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐజీడీఎస్‌యూ, ఎన్‌యూజీడీఎస్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టగా సిరిసిల్ల పోస్టాఫీస్ ఎదుట నిరసన చేపట్టి మాట్లాడారు. కమలేశ్‌చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలని, రెగ్యులర్ జీడీఎస్‌లు సెలవు పెట్టినప్పుడు వర్క్‌లోడ్‌తో సంబంధం లేకుండా సబ్‌స్టిట్యూట్‌ను అనుమతించాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యూటీ రూ.5లక్షలకు పెంచాలని, పెయిడ్ లీవుల సౌకర్యం, జీడీఎస్, వారి కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. మొదటి రోజు సమ్మెలో ఎన్‌యూజీడీఎస్‌యూ సిరిసిల్ల డివిజన్ సెక్రెటరీ బాలయ్య, బాల్కి రమేశ్, శంకర్, తిరుపతి, కృష్ణమూర్తి, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: కనీస వేతనాలు, వేతన సవరణకు డిమాండ్ చేస్తూ గ్రామీణ తపాలా ఉద్యోగులు సమ్మె చేపట్టారు. మండల సబ్ పోస్టాఫీస్‌లోని ఉద్యోగులు, సిబ్బంది సమ్మె చేపటగా తపాలాసేవలు నిలిచిపోయాయి. సమ్మెలో శ్రీనివాస్, సలీం, సాయికుమార్, కనుకయ్య, ఫిరోజ్, షఫీ, పాల్గొన్నారు.

దరఖాస్తులు చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని గ్రామాల రైతులు రైతుబంధుకు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి చాడ భూంరెడ్డి కోరారు. వ్యవసాయాధికారి కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. గ్రామాలవారీగా రైతుబంధుకు అర్హులైన వారి జాబితా పంపించామన్నారు. వ్యవసాయ విస్తరణ అధికా రులను సంప్రదించి వివరాలతో మండల కా ర్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న భక్తులు

చందుర్తి(వేములవాడ): మండలకేంద్రంలోని గచ్చుబావి ఆవరణలో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి సామూహిక పడిపూజ మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. గురుస్వామి గుడెం పురుషోత్తమాచార్యుల ఆధ్వర్యంలో పడిమెట్ల పూజ నిర్వహించారు. అయ్యప్ప స్వామి మాలధారణ స్వాములతో పాటు మహిళా భక్తులు, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు లింగారెడ్డి, పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు. అయ్యప్ప స్వాములు షిర్డి మల్లేశం, లింగాల రాజయ్య, తిరుపతి, రాజేశం, రాములు, మర్రి నిశాంత్, సురేశ్, మర్రి లక్ష్మణ్, రాజూరి విష్ణు, చిలుక భూమేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషిచేయాలి


మాట్లాడుతున్న నోడల్ అధికారి కృష్ణహరి

ఎల్లారెడ్డిపేట: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తొలిమెట్టు (ఎఫ్‌ఎల్‌ఎన్) మండల నోడల్ అధికారి కృష్ణహరి అన్నారు. మండలంల్నోి రాచర్ల గుండారంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో బోధనాభ్యసన ప్రక్రియ, రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన విద్యార్థులపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పప్పుల శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, కవిత, పద్మ పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి

సిరిసిల్లటౌన్: తెలంగాణ ఉద్యమ కళాకారులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆటపాటలతో ప్రజల్లో చైతన్యం కల్పించిన కళాకారులకు ఇచ్చిన హామీలు గత ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. కళాకారులకు భూమి, ఉపాధి అవకాశాలు కల్పించాలని, నివేశన స్థలాలతో పాటు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. నాయకులు వెంకటరెడ్డి, రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'తొలిమెట్టు'



సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'తొలిమెట్టు' కార్యక్రమాన్ని ప్రాథమిక పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు సిరిసిల్ల నోడల్ ఆఫీసర్ ఎల్.శారద పేర్కొన్నారు. మంగళవారం సిరిసిల్ల స్కూల్ కాంప్లెక్సు పరిధిలోని రగుడు, చంద్రంపేట, జ్యోతినగర్, శాంతినగర్, సంజీవయ్యనగర్ పాఠశాలలను సందర్శించి మాట్లాడారు. గతేడాది మాదిరిగానే తొలిమెట్టు కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో శక్తి సామర్థ్యాలను పెంపొందిస్తామన్నారు. ప్రతి విద్యార్థికి రాయడం, చదవడం, చతుర్విధ ప్రక్రియలపై పట్టు సాధించేలా కృషిచేయాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

కనుకయ్యకు నివాళి

సిరిసిల్లటౌన్: కార్మిక నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తాటు కనుకయ్య మృతిపై సుందరయ్యనగర్ ప్రజలు సంతాపం తెలిపారు. మంగళవారం వక్తలు మాట్లాడుతూ సిరిసిల్లలో సుందరయ్యనగర్‌లో పేదలు నివాసముండేందుకు ఐదు దశాబ్దాల క్రితం పోరాడి పట్టాలు వచ్చేలా కృషి చేశారన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఇక్కడ కౌన్సిలర్ దూస వినయ్, మాజీ కౌన్సిలర్ బత్తుల వనజ, రమేశ్, సుంచు ప్రకాశ్, దుబాల వెంకటేశం, వెంగల గణేశ్, రాపెల్లి రమేశ్, బొజ్జ శ్రీనివాస్ తదితరులున్నారు.

అధికారుల విచారణ

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మామిడిపల్లి గ్రామాన్ని మంగళవారం వైద్యాధికారులు సందర్శించారు. గ్రామానికి చెందిన తీపిరెడ్డి లక్ష్మారెడ్డి డెంగీ లక్షణాలతో మృతి చెందాడని తెలుసుకున్న అధికారులు విచారణ జరిపారు. గ్రామంలో జ్వరాల గురించి సర్వే నిర్వహించారు. జిల్లా మలేరియా ప్రోగ్రాం అధికారి శ్రీరాములు, మండల వైద్యాధికారి వేణుమాధవ్, సూపర్‌వైజర్ రషీద్, ఏఎన్‌ఎం వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రేపాకలో క్షుద్రపూజలు కలకలం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం రేపాకలో చేతబడి కలకలం రేపింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి క్షుద్ర పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం గుర్తించిన గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. చేతబడి చేసినట్లు బెంబేలెత్తడంతో అవన్నీ మూఢ నమ్మకాలని ఆకతాయిలు చేసిన పనే అని పలువురు తెలిపారు.

వదంతులు నమ్మొద్దు

ఇల్లంతకుంట మండలం రేపాకలో చేతబడి జరిగిందంటూ వస్తున్న వదంతులను నమ్మవద్దని రేపాక ఎంపీటీసీ కాత సుమలత మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. క్షుద్రపూజల పేరుతో గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేసేందకు కొందరు ఆకతాయిలు చేసిన పని అన్నారు. పాఠశాల అధ్యాపకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని త్వరలోనే పోకిరీలను పట్టుకుంటారని తెలిపారు.

మద్యం దుకాణం తొలగించాలి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో గల మద్యం దుకాణాన్ని తొలగించాలని రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘాలు (టీఎస్ఏవైఎస్) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సావనపెల్లి రాకేష్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఎక్సైజ్ సీఐ ముస్తాఫాకు ఫిర్యాదు చేశామని, అధికారులు చర్యలు తీసుకోకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

బెల్ట్‌షాపులు..

గంభీరావుపేట: గ్రామాల్లో బెల్ట్‌షాపులు తొలగించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున అక్రమ మద్యం దుకాణాల తొలగింపునకు చర్యలు చేపట్టాలని కోరారు.

పరామర్శ

కోనరావుపేట: ప్రభుత్వం ఇచ్చిన భూమిని లాక్కునేందుకు అధికారులు ప్రయత్నించడంతో ఆత్మహత్యకు యత్నించిన మల్యాల నందయ్యను పలువురు నాయకులు మంగళవారం పరామర్శించారు. బీమ్‌ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మల్లారపు ప్రశాంత్, బీఎస్పీ నాయకులు పిట్టల భూమేశ్, స్వామిగౌడ్, మధుకర్, కాంగ్రెస్ నాయకులు బాల్‌రెడ్డి, ఉప్పుల గంగయ్య, ఎరవెల్లి విజయ్, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘాల నాయకులు వేణు, తదితరులు పరామర్శించారు.

చర్యలు తీసుకోవాలి

కోనరావుపేట: పోరాడి సాధించుకున్న తెలంగాణలో దళితుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారని బీఎస్పీ మండలాధ్యక్షుడు కుమ్మరి దేవదాస్ అన్నారు. మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ కొండాపూర్ వాసి మల్యాల నందం తనకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని మళ్లీ లాక్కోవడంతోనే ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించాడన్నారు. అతడిని లంచం అడిగిన సర్వేయర్, ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పులి సునీల్, కుమ్మరి విజయ్, బుట్టి ఇమ్మానియేలు, కిషోర్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విలువలు పెంచేందుకు కృషి

సిరిసిల్లటౌన్: విద్యార్థులు, యువతలో విద్యా, సామాజిక విలువల పెంపుకు కృషిచేస్తామని వ్యక్తిత్వ వికాస నిపుడిగా శిక్షణ పొందిన సిరిసిల్లకు చెందిన కుర్రే తిరుపతి అన్నారు. జిల్లాలోని 17వ పోలీస్ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తిరుపతి ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నెలరోజులపాటు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణను పొందారు. మంగళవారం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న సంఘ సభ్యులు, నాయకులు

రుద్రంగి: మండలకేంద్రంలో ని శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి, వీర బ్రహ్మేంద్రస్వామికి మండలకేంద్రానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేగా గెలవడంతో మంగళవారం ప్రత్యేక పూజలు చేసి తంతెకు ఒక కొబ్బరికాయ కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఎర్రం గంగ నర్సయ్య, పల్లి గంగాధర్, గండి నారాయణ, ఇప్ప మహేశ్, పరందాములు, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.